# కవితా కౌముది

## నొప్పుల గది

పనసకర్ల ప్రకాశ్

నన్ను వదలండి
నేనూ ఆ గదిలోకి వెళ్లాలి!
నేను తన పక్కనే నుంచొని
మా అమ్మ నన్ను కనడానికి పడ్డ
అప్పటి పురిటి నొప్పులను ఇప్పుడు కళ్ళారా చూడాలి!

దయచేసి నన్ను ఎవరూ ఆపకండి!

తెలిసో తెలియకో
సరదాకో నిజానికో...
నీయమ్మ...అనే మాటను ఇన్నాళ్లూ ఊతపదం గా పలికిన
నేను
ఇకనుంచి "అమ్మ" అనే మాటను
జీవితమంతా మంత్రంగా ఉచ్చరించగలిగే శక్తి కోసం
ఆ గది లోపలకి నన్ను అనుమతించండి!

సంసారమంటే ,కామంతోనో ,కోరికతోనో
ఆ "స్థానం" కోసం  రగిలిపోవడం కాదు

ఆ స్థానమే నాకు జన్మనిచ్చిన ఆస్థానమని
తెలుసుకోడానికి
ఆ పవిత్ర స్థానాన్ని అంతే పవిత్రంగా
మొదటిసారి దర్శించు కోడానికి
నన్ను వెళ్లనివ్వండి!

ఈసారి బిడ్డకోసం తప్ప
ఆ స్థానానికి నేనే రాజనని రమించే
అహంకారం ఆరిపోవడానికి
తను నొప్పులు పడుతున్నప్పుడు
నన్ను ఆమె పక్కనే చేయిపట్టుకుని ఉండనివ్వండి!

విత్తనం పడిన చోటే మొక్కని సృష్టించడానికి
ఆ  తల్లి పడే కష్టాన్ని చూసి
నేను మనిషిగా మారడానికి
ఆమె పక్కన నన్నూ ఒక తల్లిగా నిలబడనివ్వండి!

ఎప్పుడైనా నా బిడ్డ
తన తల్లిని చిన్న మాట అంటే
నిన్ను కనడానికి...
మా అమ్మలాగే మీ అమ్మ కూడా చచ్చి పుట్టిందని
తన తల్లి ప్రేమను నా బిడ్డ కళ్ళకు కట్టినట్లు చెప్పడానికైనా
ఆ నొప్పులను నన్ను కళ్ళారా చూడనివ్వండి!

బిడ్డలు రెక్కలొచ్చి ఎగిరిపోతున్నప్పుడు కాదు
బిడ్డను కంటున్నప్పుడే ఆమెకు కడుపు "కోత"
తెలుసన్న విషయం, నాలాంటి భర్తలకు
తెలియజెప్పడానికైనా ఆ గదిలోకి నాకు
అనుమతిని నివ్వండి!

నా పక్కన ఆమె ప్రేమతో పడుకునేది
సుఖం కోసం కాదు
ఆ నొప్పుల విలువ
తన ప్రాణంఖరీదని తెలిసికూడా పడుకున్నది
కేవలం మాతృత్వం మీద ప్రేమతో నని
నాలాంటి వారికి తెలియడం కోసమైనా
నన్ను ఆ గదిలోనికి  వెళ్ళనివ్వండి!

ఆమె నొప్పులు పడే గదిలోకి భర్తగా వెళ్ళి
తిరిగి ఆమె బిడ్డగా బైటకు రావడానికి
నాకొక్క అవకాశం ఇవ్వండి!
ఆమె నొప్పులు పడుతున్న గదిలోకి
నన్ను ఒక్కసారి వెళ్ళనివ్వండి..! ★★★

# అమర్త్యుడు

సుజాత పి.వి.ఎల్

గరళం మింగితే
ఎలా ఉంటుందో..
నిరాశ నిండిన
మనసు ఎలా కృంగిపోతుందో..
అలసట చెందిన
గుండె ఎంత ఆయాసపడుతుందో..
సౌందర్యాన్ని వీక్షించలేని
నయనం ఎంత బాధ పడుతుందో..
అంతకు మించి
రెట్టింపు వేదన నాలో కలుగుతోంది..!
నీ ఎడబాటు
నన్ను విస్మృతిలోకి నెట్టేస్తున్నట్టుంది..!
బలవంతంగా
అగాధంలోకి పడేస్తున్నట్టుంది..!
నువ్వు తప్పు చేశావ్
అవును..నేనన్నది, నువ్విన్నది
అక్షరాలా నిజమే..

నిజంగా నువ్వే తప్పు చేశావ్
అతిగా నాకు ప్రేమని పంచి ఇచ్చి
అర్థంతంగా వెళ్ళిపోయి
పెద్ద తప్పే చేశావ్
నీ ప్రేమే శాశ్వతమని తలచాను,
నీడలా నా మనసు
నిను వీడిపోలేని
నాలాంటి ప్రేయసిని పొంది
అతి పెద్ద తప్పు చేశావ్
నువ్వు వదిలివెళ్ళిన
జ్ఞాపకాల్ని బహుమానంగా స్వీకరించి
నిన్ను నాలోనే చూసుకుంటున్న
స్నిగ్ధ సహచరిని నేను !
నా నుండి ఎన్నటికీ
దూరం కాని అమర్త్యుడవు నీవు.!!



## ఎదలో నీవు భద్రంగా..

చందలూరి నారాయణ రావు

ఎదురు పడకపోయినా
మాటలు తేలిగ్గా  పడి మొలిచాయి.
దృశ్యాలు పురుడు పోసుకోకుండా
రంగులు రెక్కలు విప్పకనే
రుచుల పుట్ట పగలకుండానే
కోపాగ్ని లావాలా ఎగజిమ్మి
భావం బీటలువారి
పదాల పొట్ట పగిలి ,
శబ్ధాల గుట్టు  చెదరి
గుట్టల గుట్టలుగా
అర్థంపర్థంలేని  నడకతో
తొక్కిసలాటలో
మనసు నలిగి,
మనిషి పగిలి
ఆవలి గట్టుకు విసిరబడినా
ఎదలో నీవు భద్రంగా
పలుముక్కలయ్యాడు.

★★★

## పునఃపునః

అగస్త్యప్రగడ హేమంత

మనసు కదలికలు కొన్ని,
అక్షరాలై కలానికి
దొరికిపోతుంటాయి!
కొన్ని, స్వరాలై
గళానికి అందొన్నిస్తాయి!
కొన్ని, పట్టు చిక్కని
నీటి బిందువులై
కాలం అరచేతుల్లోంచి
జారిపోతుంటాయి!
కొన్ని, రంగుల కలయికగా చేరి
కుంచెల కొసలతో
ప్రాణం పోసుకుంటాయి!
మళ్ళీ... ఎప్పటికప్పుడు
ఎక్కడికక్కడ, ఎన్నెన్నో
ప్రకంపనలు...
తలెత్తుతూనే ఉంటాయి...
శిశిరం తర్వాతి చిగురుల్లా!
సాగరంలోని కెరటాల్లా!

★★★



# అనుకోని ఉపకారం

శ్రీధర రెడ్డి బిల్లా

రోడ్డు ప్రమాదాలతో
రోజూ నెత్తురోడి రోదించే రోడ్లు,
రొద వదిలి, రొమ్ము విరుచుకొని,
కొన్నిరోజులుగా మొద్దు నిద్దరోతున్నాయి!
తరాల తరబడి తామసంతో
తలలు తెగనరుకుతున్న తాలిబాన్లు
తమకు తామే మూతులు మూసుకొని
తలుపులకు తాళాలేసుకున్నారు!
మానభంగాలను చూసి చూసి
ఆర్తనాదాలను విని విని, ఆపలేక ఓపలేక
మౌనంగా ఏడ్చిన పాతబంగాళాలు,
ఆనందంగా పిట్టగూళ్ళతో అలరుచున్నాయి!
పోలీసుల, పోరుబాటనున్న అన్నల,
తుపాకీ తూటాల మోతలతో
దద్దరిల్లి చెవులు గడలుకట్టిన దండకారణ్యం
యేటి గలగలలు, పక్షుల కిలకిలలు వింటున్నది !
తిరుపతి వెంకన్న దర్శనం
మరి తమకేలలేదని తలచి వగచిన మూగజీవాలు,
తిరుమల వీధుల్లో తిరుగాడుచూ
తిరిగి తిరిగి తిరుమలేశుని దర్శించుకుంటున్నాయి!
తీరిక లేకనో లేక, వండే ఓపిక లేకనో
తిరగదోడు నూనెవాడు బయటి తిండితిని
అనారోగ్యంతో కునారిల్లే ఇంటిల్లిపాదీ,
వేడి వేడి ఇంటివంటలు ఆస్వాదిస్తున్నారు!
పీడించి పీడించి లంచాలను పీల్చగా,
శ్రమజీవుల అశ్రువులతో,స్వేదంతో తడిచిన నోట్ల
వాసన పీల్చిపీల్చి వాసన చచ్చిన
ప్రభుత్వాఫీసులు పూలవాసన పీలుస్తున్నాయి!
సెటిల్మెంట్ దందాలు చేసిన నేతల చేతులు
పాపాలను గుర్తుచేసుకుని పశ్చాతాపంతో
కమీషన్లకు కక్కుర్తి పడ్డ నేతల మూతులను
గుడ్డతో కప్పెట్టి గుంజి కట్టేస్తున్నాయి!
పాపపంకిలపు అక్రమ సంబంధాలను,
వ్యామోహపూరిత ప్రేమల పాపాలను,
మోసి మోసి విసిగిన పార్కుల పొదళ్లు,
చిరుగాలికి హాయిగా పరవశిస్తున్నాయి!
సుంకాల పేరుతో లంచాలకు ఎగబడ్డ
విమానాశ్రయ అధికార్ల అమానుష చేతులు,
వీపులు గోక్కుంటూ, విరక్తితో జుట్లు పీక్కుంటూ
పిచ్చి చూపులతో దిక్కులు చూస్తున్నాయి !
వీరబొట్టు పెట్టి, కత్తులు చేతబట్టి
వీధులెంట తిరుగు వీధిగుండాల
హత్యలతో హడలి చచ్చిన వీధులు,
హాయిగా జోలపాటలు పాడుకుంటున్నాయి!
కుటుంబాలను కూల్చి , పీల్చి పిప్పి చేసి
పసివాళ్ల పాలసీసాల పైసల్ని సైతం పట్టిలాగి
గలగల లాడిన క్యాసినోల గల్లా పెట్టెలు
వెలవెలబోయి తలలు నేలకు వేలాడేసాయి!
విషపు ధూళి నిండి
వీసమెత్తు ప్రాణవాయువు లేక
విలవిలలాడిన వాయుదేవుడు
విసురుకొని కొంత ఊపిరిపీలుస్తున్నాడు!
గంగమ్మ పేరుకే గాని,
గరళమే ఉన్నదంతా అంటూ
గడగడలాడి గుండెలవిసిన గంగమ్మ,
గలగలపారుచూ మైలవదల్చుకుంటున్నది!
మానవులలో దానవత్వం హెచ్చునపుడు,
దండించి దారిలో నుంచడానికి
ప్రకృతిమాత తన ఆకృతి మార్చుకొని
బెత్తమెత్తిన తండ్రిపాత్రనెత్తుతుంది!
పరంధాముని పదకొండవరాకకు
ప్రకృతిమాత ప్రవరించి సిద్ధమవుతుంది!

★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఎపుడు మనపైన శుభదివ్యదృష్టి చిలుకు
ఎపుడు కరుణామృతమ్ము వర్షించునిచట
ఎప్పుడా ప్రేమతో నిండునీ జగత్తు
ఎప్పుడా స్పర్శతో జగమెల్ల మురియు

ఏ మలినమిట్టులీ భువికేలికయ్యె
ఏల యానందమిట్టుల మృగ్యమయ్యె
జీవమేలనో యిట్లు నిశ్చేష్టమయ్యె
కన్నులెందుకొ చూచునాకసము వైపు

చిత్తమంతయు నేడు నిస్తేజమయ్యె
శక్తులెల్లను తనువున సన్నగిల్లె
జరయు రుజయును కాని నిస్త్రాణ నాది
మృత్యుభృత్యాక్రమణమయ్యె పృథివి యెల్ల

ఏ మహాచేతనత్వమీ యిలను నిండె
ఆ మహాద్భుతశక్తి నేడల్పమయ్యె
తలపనేరము ధరణి నిస్త్రాణమంచు
జాగృతస్థితి మరల యాసన్నమగును

ఎన్నొ వేదనలాపదలిడుమలెన్నొ
కనుల చూచుచునుందుము దినదినమ్ము
కఠినగతులన్ని మృత్యుమార్గములు గావు
బ్రతుకుపయనంపు తీరాంతరములు గావు

COMMENTS